పత్రికాప్రకటన                    కాకినాడ, సెప్టెంబర్ 26, 2019.

**రైతు బజార్ లో 25 రూపాయలకే కిలో ఉల్లిపాయలు – జేసి లక్ష్మీశ.**

దేశంలో ఉల్లి ఉత్పత్తి దిగుబడి తగ్గుదలతో పాటు వర్షాల మూలంగా సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలమూలంగా ప్రజలకు సక్రమ రీతిలో జిల్లాలోని రైతు బజార్లలో కిలో 25 రూపాయలు చొప్పున ఉల్లిపాయలు విక్రయించనున్నట్లు జాయింట్ కలక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారంనాడు కలక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో జాయింట్ కలక్టర్ లక్ష్మీశ పాత్రికేయులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉల్లి ఉత్పత్తి 50 శాతం తగ్గిందని, అదే విధంగా భారీ వర్షాలు, వరదలు మూలంగా కూడా ఉల్లి రవాణాకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టు కుని ఉల్లి ధరను నియంత్రణలో భాగంగా రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి ఒక కిలో ఉల్లిపాయలను శుక్రవారం నుండి 25 రూపాయలకే విక్రయించే విధంగా ఏర్పాట్లు చేశామని జేసి తెలిపారు. ప్రస్తుతం ఉల్లి కర్నూలు నుండి రప్పిస్తున్నామని, అవసరమైతే మహారాష్ట్రా నుండి కూడా రప్పిస్తామన్నారు.

జిల్లాకు ప్రతి రోజు 25 టన్నుల ఉల్లి అవసరమవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతు బజార్లలో ఉల్లి విక్రయాలు చేపడుతున్నామన్నారు. ఉల్లిపాయల విక్రలయాల్లో అవకతవకలు జరుగకుండా ప్రత్యేక కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయన్నారు. మార్కెట్ లో ఉల్లిపాయలు అక్రమ నిల్వలు చేసి అధిక ధరలకు అమ్మే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులను అప్రమత్తం చేశామని జేసి తెలిపారుల. జిల్లాలో 14 రైతు బజార్ల ద్వారా ఉల్లి విక్రయాలు జరుగుతాయన్నారు . ఒక్కోరేషన్ కార్డుకు వారానికి ఒక కిలో చొప్పున ఉల్లి సరఫరా చేస్తారని జేసి తెలిపారు. రేషన్ కార్డు లేకపోతే ప్రత్యామ్నాయ కార్డులు పరిశీలిస్తామన్నారు. అవసరాన్ని బట్టి మొబైల్ వేన్ల ద్వారా ఉల్లి సరఫరా చేస్తామని జాయింట్ కలక్టర్ లక్ష్మీశ పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ఈ పాత్రికేయుల సమావేశంలో సమాచార శాఖ ఉపసంచాలకులు యం.ఫ్రాన్సిస్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కిషోర్ లు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )